# పాపం కుంటేలుగాడు

కుంటేలు గాడు కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

తన కండ్లు కండ్లు కావు. ఆ కండ్లల్లో కారేదీ కన్నీళ్ళు కావు. ఆ సంగతి తనకు తెలుసు. అందుకే ఏడుపును తన గుండెలకే పరిమితం చేసుకొని ఏడుస్తున్నాడు.

వాడి బాధను యితరులు పసికట్టారంటే "ఒరే! కుళ్లు బోతు నా కొడకా! ఇదేం పాడు బుద్దిరా? ఇట్టా పాడుబుద్ధి ఎవుడికైనా పుట్టిందా? ఇట్లా ఎవుడైనా ఆలోచిస్తాడా? పోనీ, ఆలోచించినా యిట్లాపనికి వగతెగిస్తాడా? చేసుకున్నోడికి చేసుకుణ్ణంత! చేజేతులా చేసుకునిందానికి అనబవించక తప్పితిందా?" అని దెప్పి దెప్పి పొడస్తారు.

అందుకే వాడు లోలోపల కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు!...

రాయలసీమలో అదొక పల్లె.

ఇంగువ కట్టిన గుడ్డగా మిగిలిన ఈ రత్నాలసీమలో చీమలు దూరని చిట్టడవుల కవతల ఆ పల్లె. ఆ పల్లెకు పరుగు దూరాన వాడ. వాడ చివర ఒక గుడిసె!

రత్నాల సీమలో గుడిసె!

నాలుగు రాతి కూసాలు. నాలుగు నాలుగు ఎనిమిది లేకపోతే ఎనిమిదిఎనిమిది పదహారు వాసాలు. రెండు మోపుల తాటి మట్టలు. కాకుంటే టెంకాయ కీతులు. వాటికీ నోచుకోలేకపోతే రెండు వాదెల బోద కసువు. రాతి కూసాల్ని కలుపుతూ చుట్టూ మట్టిగోడ పెట్టే అది చుట్టు గుడిసె!

అలాంటి గుడిసెలో మాకడు, మంగ దాదాపు పదేండ్ల అన్యోన్య దాంపత్యానికి సాక్షి కుంటేలుగాడు.!

మాకడు ప్రతిదినము తూర్పున పటమెగరక ముందే నిద్రలేస్తాడు. మంగ మాత్రం ఇంకా ఆ కుక్కి మంచానికే అతుక్కొని అట్లా ఇట్లా పొర్లాడుతూ ఉంటుంది. గుడిసె ముందర నాలుగు తడికెల్ని అడ్డదిడ్డంగా కట్టే ఆ పెరట్లో ఒక బాన. ఆ బానలో రాత్రి

తెచ్చిపోసిన నీళ్లు. గుక్కెడు నోట్లో పోసుకొని పుక్కిలించి ఊస్తాడు. గుడిసెలో 'ఎనుగాడి'కి వేలాడుతూ ఉట్టి. ఉట్టిమీద ఒక చట్టి. ఆ చట్టిలో రాత్రి మిగిలించిన రెండు పిడికిళ్ళ మెతుకులు. ఆ కూటిలో పోసిన నీళ్లు...కూట్నీళ్లు! పిడికెడు మెతుకుల్ని పిడిచి ముంతలో వేసుకొని రెండు దోసిళ్ళ కూట్నీళ్లు వంచుకుంటాడు. ముంతను మూడుచుట్లు తిప్పి గొంతులో పోసుకొంటాడు.

అప్పుడు లేచి మంగ సంగటి చిక్కాన్ని చేతికందిస్తుంది. ఆ చిక్కాన్ని చంకలో తగిలించుకొంటాడు. కత్తి చేతబట్టి అడవికి బయలుదేరతాడు.

మధ్యాహ్నానికి నిలువెత్తు కట్టెల మోపుతో తిరిగి వస్తాడు.

ఆ కట్టెలమోపును ఆపల్లెలోనో, పల్లెకు పరుగుదూరాన పేటలోనో అమ్ముకొంటాడు. మంగను గడప దాటనీకుండా గుట్టుగా కాపురం చేస్తున్నాడు.

ఒకనాడు మాకడు పుట్ట మీదెక్కి కట్టెలు కొట్టుకొంటున్నాడు. ఎక్కడ మాటేసి ఉండిందో ఒక పాము కాటేసి పోయింది. అక్కడికక్కడే నురగలు కక్కుతూ 'హరీ' మన్నాడు. మాకడు.

అప్పుడు కూడా ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు కుంటేలుగాడు!

గడపదాటనీకుండా కన్నుల్లో పెట్టుకొని కాపాడుకొంటూ వుండిన మొగుడు పాము వాత పడేటప్పటికి మంగ మంచం వాత పడింది. ఒక్కగానొక్క నలుసు కుంటేలుగాడు. వాడికోసం ఎంత తొందరగా దిగాలో మంచం అంత తొందరగా దిగాలనుకొనింది. ఏడాది తిరగకముందే దిగింది-అయితే పాడె మీదికి.

అప్పుడు కూడా కుంటేలుగాడిలా కుమిలి కుమిలి ఏడవలేదు.

తండ్రి పోయాడు. తల్లీ పోయింది. అయినా బతుకు మీద ఆశ చావలేదు. ఆ స్థితిలో ఆ వయసులో ఎవరైనా చేసేపని చేయి చాపడం. అయితే కుంటేలుగాడు చేయి చాపలేదు. చేతికొద్దీ కష్టపడ్డాడు. ఆ ఊళ్లో ఎవరేపని చెప్తే ఆపని చేశాడు. పెడ్తే తిన్నాడు. పెట్టకపోతే పస్తులు పడుకొన్నాడు.

అప్పుడు కూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు!

ఒకనాడు మిట్ట మధ్యాహ్నం కుటేలుగాడు గుడిసింటి గోడకానుకొని కూర్చున్నాడు. ఆ ఎండపూట ఎందుకో వాడికి తెలియకనే వాడి వొంటిమీద చూపు పడింది. ఒళ్లు కాస్త కండ పట్టినట్లుంది. పిల్లి గడ్డం మొలిచింది. సన్నగా మీసకట్టు కూడా ఏర్పడింది. 'ఇంకా వొంగి వొకడి మోసేతికింద నీళ్లు తాగాల్నా?' అనుకొన్నాడు. అలా అనుకోవడంతో వాడి మెడ బిర్రు తన్నింది. చూపులు గుడిసింటిని కలయ చూశాయి.

చూస్తే ఏముంది?

చూరులో చెక్కిన మచ్చు కత్తి. గుడిసింటి 'ఎనుగాడి'కి తగిలించిన చిక్కం. ఈ రెండూ తండ్రి జీవితంతో పోరాడి పోరాడి తన కోసం వారసత్వంగా నిలబెట్టిన ఆస్తులు.

బాల్యంలోనే తండ్రిని పోగొట్టుకొని సింహాసనానికి వారసత్వాన్ని సాధించిన బాల మొగలాయి చక్రవర్తిలా కుంటేలుగాడు ధీమాగా పైకి లేచాడు. చూరులో కత్తిని ఒరనుండి లాగినట్టు లాక్కొన్నాడు. బాగా నూరి కత్తి వాదరను ఎడమచేతి బొటనవేలితో తడిమి చూశాడు.

కత్తి మంచి పదునుమీద ఉంది!

కుంటేలుగాడు అడవిలో జొరబడ్డాడు. వాడి చేతుల్లో మాకులు మోడులౌతున్నాయి. కత్తి చేతపట్టితే వాడికి కన్ను మిన్ను తెలియదు. ఆ స్థితిలో ఒకదినం కత్తి చేజారింది. కాలి బొటనవ్రేలు కసక్కమని తెగింది. తెగిందంటే అలా ఇలా కాదు. కొమ్మనుండి వేరు పడిన రెమ్మలా వేరైంది. అమ్మ నాయన అల్లారుముద్దుగా పెట్టుకున్న మునిగాడి పేరును 'ఎగాడి' కెక్కించి ఊళ్లోవాళ్లంతా 'కుంటేలుగాడు' అన్నారు.

అప్పుడు కూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు.

కుంటేలిగాడికి కాలివేలు కుంటైనా కాళ్లున్నాయి. ఆ కాళ్లమీద నిలబడే శక్తి ఉంది. చేతులున్నాయి. ఆ చేతుల్లో శ్రమ శక్తి ఉంది. హాయిగా పూట గడిచి పోతూ ఉంది.

వాడికి మనస్సు ఉంది. ఆ మనస్సుకు కోరికలూ ఉన్నాయి.

ఒకనాడు కుంటేలుగాడు గుండెల్లో కోరికలు గుర్రాలైతే తన ఆశలు రథానికి కట్టుకున్నాడు. ధైర్యాన్ని కూడగట్టుకొన్నాడు. దినానికొక్క రూపాయిబిళ్ల వంతున దొంతి అడుగు కడవలో దాచి పెట్టిన రూపాయి బిళ్లల్ని మూటగట్టుకొన్నాడు. ఆ మూటెత్తి భుజాన పెట్టుకొన్నాడు. నేరుగా పినపెద్ద ఇంటికి నడిచాడు. అప్పుడు పినపెద్ద ఇంటి ముందర వాకిట్లో మంచం మీద కూర్చొని వాడలోని పెద్దలతో మంతనా లాడుతున్నాడు. కుంటేలుగాడు భుజాన మూట దించి పినపెద్ద ముందర పెట్టాడు.

"ఏందిరా అది కుంటేలూ?" సందేహంగా అడిగాడు పినపెద్ద.

"ఓలి మామా!"

"గేలి చేస్తుండావా?"

"లేదు మామా!...నన్నొక ఇంటోణ్ణి చెయ్యమని అడుక్కుంటా ఉండా!"

ఆమాట చెవిన పడగానే పక పక నవ్వాడు పినపెద్ద.

"ఒరే! వొలిస్తే పొట్టు! దంచితే నూకా? ఏముండాదిరా నీకు? అందులో కుంటేలుగాడివి. నీ కెవురిస్తార్రా పిల్లను?"

పినపెద్ద మాటల్తో వాడలో పెద్దలు నవ్వందుకొన్నారు. ఇల్లెగిరి పోయేటట్టు విరగబడి నవ్వారు. ఆ నవ్వులు విని కారణం ఊహించుకోలేకుండా గబగబా బైటికివచ్చి పరిస్థితిని అర్థం చేసుకున్న పినపెద్ద కూతురు చెంగి మామ నిస్సహాయ స్థితిని గమనించి భారంగా నిట్టూర్చి గిరక్కున వెనక్కు తిరిగింది.

అది ఎవరి కంట్లో పడలేదు!

అప్పుడు కూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు!

ఒకానొకరోజు...ఒకానొక వేళకాడ పినపెద్ద ఒకే ఒక్క ముద్దుల కూతురు చెంగి వొంచిన తలెత్తకుండా ఇల్లు విడిచి పెట్టింది. తిరిగి చూడకుండా నడిచింది. ఊరి చివర గుడిసెలో దూరింది. కుంటేలుగాడి ముందర నిలబడింది. వొంచిన తలెత్తకుండానే 'బొట్నేలుతొక్కి బొట్టు కట్టుమామా!' అని అడిగింది!

కుంటేలుగాడు ఎర్రోడి మాదిర ఎగాదిగా చూశాడు!!

ఎలా చూసినా ఎదుట నిలబడింది మాత్రం పినపెద్ద ముద్దుల కూతురు 'చెంగే!' అని తెలిసేసరికి తెల్ల మొగం వేశాడు. ఎగిరిపడినట్టు ఏడడుగులు వెనక్కు జరిగాడు. అక్కడ నిలబడి అటూ ఇటు కలయచూశాడు. నిజంగా అది తన గుడిసే! కలా?నిజమా? అని కలవర పడిపోయాడు.

"మామా! యాప పువ్వు గుమ్మిడి పువ్వంత పెద్దది కాదు. రోజా పువ్వంత అందమైందీకాదు. ఇప్ప పువ్వంత మత్తైంది కాదు. మల్లా ఏమి చూసుకోని తుమ్మీద ఆ చేదుపువ్వు చుట్టూ తిరుగులాడుతుంది. నువ్వు ఎప్పుడైనా ఆలోచించినావా చెప్పు మామా?" చెంగి కిలకిల నవ్వులు కలబోస్తూ అడిగింది.

ఈ రహస్యం అర్థం కాకుండా కుంటేలుగాడు అయోమయంగా చూస్తూ ఉంటే అందంగా నవ్వుతూనే ఉంది చెంగి!

కత్తి పట్టిన చెయ్యి తాళి పట్టుకోవడానికి తటపటాయించింది.

"నువ్వేమీ బయపడాల్సిన పనేలేదు. నీ పాణానికి నాపాణం ఉండాది." అని ధైర్యం చెప్పింది.

తడబడుతున్న చేతులతో ముసిముసి నవ్వులతో కుంటేలుగాడు చెంగి మెడలో మూడు ముళ్లు వేశాడు. మనిషిలో తడబాటే కానీ మనస్సులో లేదు. మూడు ముళ్లు గట్టిగా పడ్డాయి.

పెండ్లి గుడిసింటి పందిరిలో మేళ తాళాలు మోగకపోయినా...పెద్దలచేతి అక్షింతలు రాలకపోయినా ఈవార్త పినపెద్ద చెవిలో పడింది.

పినపెద్ద తోకతొక్కిన త్రాచులా పైకి లేచాడు. వాడ వాడంతా ఒక్కటై పినపెద్ద వెంట నిలబడింది. అది చూసి చెంగి కుంటేలిగాడి ముందు నిలబడింది. కండ్లల్లో నిప్పులు కక్కతా...పండ్లు పట పటా కొరకతా...పైట కొంగు ఈడ్చి నడుమున చెక్కి కాళికామ్మోరులా నిలబడి 'నా మామ మింద చెయ్యి పడాలంటే నా శవం మింద మీరు నడిచి పోవాల్సిందే!' అని సవాలు చేసింది. ఇంట్లో పిల్లిపిల్లలా పెరిగిన బిడ్డ పులిపిల్లలా గాండ్రించే సరికి పినపెద్ద తోక ముడిచాడు. వాడ మెడలు వాల్చింది.

కుంటేలుగాడు తల పైకెత్తాడు.

ఇప్పుడు కుంటేలుగాడి కండ్లకు కాంతి వచ్చింది!

కత్తికి పదును వచ్చింది. ఆరోజు కూడా తూర్పున పటం ఎగిరింది. ఆ పటం, వాడి ఊహల భవిష్యత్తు ఊపిరిపోసుకొంటే వెలవెలా పోయింది.

కుంటేలుగాడు కత్తి చేతికందుకున్నాడు. చెంగి పైకి లేచింది. సంకటి చిక్కాన్ని సంకకు తగిలించుకొనింది. 'పదమామా!' అనింది.

"నువ్వెక్కడికే?" అన్నట్లు వింతగా చూశాడు. చెంగి ఆ చూపుల్ని చదవ గలిగింది.

"నీతో గూడా నేనూ ఒక మోపు కట్టెలు తెస్తాను మామా! ఏణ్ణీళ్ళకు సన్నీళ్లు తోడైనట్లైతింది గద మామా!"

"ఒసే పిచ్చిదానా! నేను బతికుండగా నీ తల్లో పువ్వులు పెడతాను గానీ తలమింద కట్టెలమోపు పెడతానంటే?"

ఆమాట వింటానే చెంగి అట్లానే వాడి ఎదమీద వాలిపోయింది. వాలిపోయిన చెంగిని వాడట్లానే గుండెల్లకు హత్తుకొన్నాడు.

"ఎదమింద ఎదబెట్టి కతల్చెప్తా పొణుకోవాలంటే పెట్టి పుట్టుండాల. కన్నగసాట్లు పడి కట్టెలు తెస్తేనే కడుపు నిండేది. ఇట్లా ఉండేదానికి మన బోటోళ్లకేడ కుదిరితింది?" అని గుండెలు కూడబలుక్కున్నట్లుంది. రెండు నిమిషాలు అనుభూతిలోనే ఆ గుండెలు బరువెక్కాయి.

చెంగి చంకలో చిక్కాన్ని చేతి కందుకున్నాడు కుంటేలుగాడు.

"కట్టెల్తేకపోతే పొయ్యింది. నేను కూడా నీతో అడవికి వస్తా మామా!"

"ఈపూట నేను అడవికి పోబొయ్యేది లేదే!"

"ఎందుకు మామా! నేను కూడా వస్తానన్నాననా?"

బదులు చెప్పకుండా కుంటేలుగాడు చిక్కాన్ని చిలుక్కు తగిలించాడు. కత్తి చేతిలోనే ఉంది. గుడిసె దాటి బయటికి నడిచాడు. ఇంతకు మునుపు ఎప్పుడూ చూడనట్లు గుడిసెను చూస్తూ నిలబడ్డాడు.

చెంగి ఇంతింత కండ్లతో వాణ్ణి చూస్తూ నిలబడింది.

కుంటేలుగాడు కత్తినటుఇటు తిప్పిచూశాడు. వాడి పెదాలు కోడి కత్తుల్లా వంపులు తిరిగాయి. ఆ వంపుల మింద కెంపులు పూశాయి. అంతే! గుడిసింటి చుట్టూ మొలెత్తుపైగా పెరిగిన ముండ్ల పొదలమీద పడ్డాడు. రెండు బార్ల పొద్దెక్కేటప్పటికి గుడిసింటి చుట్టూ శుభ్రంగా చదరమైంది. అప్పుడంత బొగ్గు నోట్లో వేసుకొన్నాడు. కరకరా నమిలి రెండు సార్లటు ఇటు తిమిడాడు. అంత తొందరగానే మొగం కడుక్కొన్నాడు. తలకు చుట్టుకున్న తువ్వాలు గుడ్డ విప్పి మొగం తుడుచుకుంటూ ఉన్నాడు. చెంగిలో చిరునవ్వులు వాడి మొగం వాకిట్లో ముత్యాలముగ్గులు వేస్తుంట, ముంతలో సద్ది కలిపి చేతికందించింది. తాగాడు. గుడిసింట్లో మంచాన్నెత్తి వాకిట్లో వేసుకొన్నాడు.

కుంటేలుగాడు మంచం దారాల్ని బిగిస్తున్నాడు.

చెంగి పొయ్యిమీద ఎసరు పెట్టి నూకల్లో రాయీ రప్పా ఏరిపిస్తూ వుంది. పొద్దు నడిమిట్ట కెక్కింది.

కుంటేలుగాడు మూరడు తుంటకట్టె చేతికందుకొన్నాడు. మంచానికి పట్టిన దుమ్ము ధూళి వదలిపోవడానికి ఆ కట్టెతో దారాలమీద తట్టుతూ ఉంటే 'టంగ్ టంగ్' మని శబ్దం వస్తూ ఉంది. ఆ మిందట మంచం మిందికి వొంగి రెండు చేతులతో మంచం దారాల్ని కిందికి అదిమాడు. అదిమినంత వరకు కిందికి వెళ్లి వదిలితే మళ్ళీ పైకొస్తున్నాయి దారాలు ఫోమ్ బెడ్‌లాగా! తృప్తిగా నవ్వుకొన్నాడు.

చెంగి కెలికిన సంకటి ముద్దలు పొగలు కక్కుతున్నాయి.

కుంటేలుగాడు మంచాన్నెత్తి గుడిసెలో వేశాడు. ఆ మంచం మీద ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. ఇద్దరి మధ్యలో ఒకటే కంచం!... అది అనురాగాల బువ్వను పంచే కంచం- ఆ కంచంలో ఇంతకు మునుపు అయిదేళ్లే! ఇప్పుడు అయిదైదు పదేళ్లు అనుకోనట్లుగా పెనవేసుకొంటున్నాయి. పెరుకులాడు కొంటున్నాయి. పెరుక్కున్న ముద్దను ఇంకొకరికి పెడుతున్నాయి. రెండు గుండెలకు నాలుగు జన్మాల అనుభూతి!

కుంటేలుగాడు పైకి లేచాడు. కత్తి చేతికందుకొన్నాడు. బయటికి నడిచాడు. చెంగి అలానే మంచం మీద వాలింది. దాని మనస్సు పూలపల్లకీలో తేలినట్లు తేలిపోతూ ఉంది.

"చాటడు వడ్లు ఆరబొయ్యచ్చు నా వరాల మామ గుండెలమింద! మూట నూగులు ఒక మూలకు సాలవు నామామ ఈపు మింద! మహా మహా మాకులే పెళ పెళ నేల కొరిగిపోతాయి నామామ చేతి ముందర! అందురూ మహా సక్కనోళ్లయినట్టు నా మామను 'కుంటేలుగాడు! కుంటేలుగాడు!!' అంటారే! ఒకవేలు కుంటిదయితే అయింది. మనసు కుంటిది కాదులే!"

సద్దిలో ఊరిబిండి నంజుకున్నంత కమ్మగా సాగిపోతూ ఉంటే ఆలోచనలు చెంగికి ఎప్పుడు కంటిమింద రెప్ప పడిందో తెలియదు.

'దఫ్' మన్న శబ్దంతో ఎగిరి పడి లేచింది. చూస్తే మొయ్యలేనంత బందారాకు మోపును గుడిసె ముందరేశాడు మామ. 'ఎందుకో? ఏమో?' అనుకుంటానే ముంతలో నీళ్లు తెచ్చి చేతికందించింది. ముంత చేతికందుకున్నాడు. అటువంటి సమయాల్లో మునుపెప్పుడూ చేతికందని అనుభవం. తీయని అనుభూతి. మురిపెంగా చూస్తూ ఒక్క గుక్కలో ముంతడు నీళ్లు ఖాళీ చేశాడు. ముంతను చెంగి చేతికిచ్చాడు. బందారాకు మోపు విప్పాడు. పెరట్లో తడికలకు చీమలు దూరనంత చిక్కంగా చెక్కాడు.

మామ మనస్సు పసిగట్టిన చెంగి ముసి ముసిగా నవ్వుకొనింది.

ఆ తర్వాత కుంటేలుగాడు అటు ఇటు చూసి పాత సంచి పట్టనొకటి చేతి కందుకొన్నాడు. చీలికలు పేలికలుగా చింపుతున్నాడు. 'ఈ మణిసి కేమన్నా పిచ్చీ గిచ్చి పట్టిందాబ్బా?' అని ఆశ్చర్యంగా చూస్తూ ఉంది చెంగి. చింపిన గోనెపట్ట పేలికల్ని

చేతికెత్తుకున్నాడు. గుడిసింటి తలుపు సందుల్లో కూరుతున్నాడు.

చెంగి కిలా కిలా నవ్వుతూ ఉంది.

"నవ్వితే నవ్వుకో! నాకేమి" అన్నట్లుగా ఎఱ్ఱమట్టిని గొజ్జు గొజ్జుగా కలుపుకొన్నాడు. సందులకు కూరిన సంచి పట్టలమీద పూశాడు. మట్టి రంగు తలుపు చెక్క రంగు దాదాపు ఒకటిగా కలిసిపోయాయి. తలుపు మూస్తే చిమ్మ చీకటి.

అమాంతంగా వాటేసుకొని ముద్దులతో ముంచెత్తింది చెంగి.

"కన్నవాళ్లు కన్నెత్తి చూడలేదు. వాడలో వాళ్లు నీడపడితే నిప్పులు కక్కతా ఉండారు. నాకు నువ్వు. నీకు నేను. మనకు మనమే మనలోకం!" అంటూ కిలకిల నవ్వింది చెంగి.

ఈ తృప్తిలో ఆనందంగా ఏడాది గడిచింది.

చెంగి నీళ్లు పోసుకొనింది.

కుంటేలుగాడి కుశాల గుడిసింటి ఎనుగాడిమిందికెక్కి కులికింది. కనపడిన పుట్టకు, చెట్టుకు రాతికి రప్పకు మొక్కాడు. 'రొండూ రొండట్టా ఏరు చేసి తల్లీ బిడ్డను సల్లంగా కాపాడుసామీ!' అని ముడుపులు కట్టాడు. చెంగి నీళ్లాడింది.

పుట్టింటివాళ్లు పురుడు పోయడానికి రాలేదు. కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమిలాడినా వాడలో మంత్రసాని మెడ మూడుతిప్పులు తిప్పింది.

పండండి మగ బిడ్డను చేతికిచ్చి చెంగి చెయ్యి జారిపోయింది.

అప్పుడుకూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు!

వరదడికిప్పుడు ఆరేండ్లు. ఈ ఆరేండ్లలో కుంటేలిగాడి తిప్పలు వాడికే తెలుసు.

ముంతడు నీళ్లతో వొళ్లు కడిగే వాటం తెలియదు. గుక్కెడు పాలు తాగిపించే వైనం తెలియదు. బ్రతిమలాడినా పినపెద్ద మాటకు భయపడి వాడలో పలికే దిక్కులేదు. ఈ పల్లె ఆ పల్లె తిరిగి కొంతకాలం ఆవుపాలు తెచ్చి పోశాడు. ఆవుపాలు దొరక్కపోతే పేటకు పొయ్యి బుడ్డీ పాలుతెచ్చి పోశాడు. పొద్దస్తమానమూ బతుకు వాడితోనే సరిపోయేది. గుడిసింట్లో వాడితోనే కూసుంటే కడుపు ఊరకే ఉండమంటే ఉంటుందా? ఒక చంకలో చిక్కం. ఇంకొక చంకలో వరదుడుగా అడవికి బయలుదేరాడు. అక్కడ ఏ చెట్టు కొమ్మకో పై గుడ్డతో ఉయ్యాల కట్టాడు. ఆ ఉయ్యాల్లో వరదుణ్ణి పడుకోబెట్టాడు. తాను ఆ అడవిమింద పడ్డాడు. కొమ్మమింద కత్తి పడేకుందికి 'కార్' మని అరుపు. ఆ ఏడుపు చెవిన పడేసరికి పరుగులమీద వచ్చాడు. బిడ్డను చేతికందుకొని సుదారించాడు. మళ్లీ పడుకోబెట్టి వెళ్లి చేతికందుకుంటే రెడ్డొచ్చె మొదలాడు వ్యవహారమే. ఒక మోపు కట్టెలు కొట్టుకొనే కుందికి పొద్దు గూట్లో పడింది. ఈ బతుకింకొద్దురా తండ్రీ అనిపించింది.

అప్పుడు కూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు!

ఒకనాడు పొద్దు తిరిగుతున్న వేళ. అందాకా ఏడ్చి ఏడ్చి వరదుడప్పుడే అలా కన్ను మూసినట్లున్నాడు. అదే సరైన అదననుకొన్నాడు. వాడు లేచేటప్పటికి మోపు కట్టెలు

కొట్టుకోవాలనుకొన్నాడు. కత్తి చేతికందుకొన్నాడు. పేగు తెంచుకొన్న బంధం గుడ్డ ఉయ్యాలకు అనుబంధమైతే ఆవేశం కత్తిలో జొరబడింది. ఒక్కమోపన కట్టెలు కొట్టుకొంటున్నాడు. ప్రతినెలా కుంటేలుగాడు కొంత మొత్తాన్ని ఫారెస్టు వాళ్లకు మామూలు కింద ముట్ట చెబుతున్నాడు. అందువల్ల ఫారెస్టు గార్డుగానీ, వాచర్ గానీ వాడి జోలికిరారు. అయితే ఆరోజు ఉన్నట్లుండి స్పెషల్ బీటోళ్లు వచ్చారు. వాళ్ల కనుచూపు దూరంలో కనిపించగానే పారిపోయేవాడే. పరిగెత్తినంత దూరం పరిగెత్తి ఏ చెట్టు చాటునో ఏ పుట్ట మాటునో లేదా ఏ పొదలమాటునో తలదాచుకుంటే పట్టుకునే దానికి వాళ్లబ్బతరం కాదు. కానీ పిల్లోడొకడున్నాడు. వాడు తన ప్రయత్నాన్ని పక్కదారి పట్టిస్తుంటే 'ఏం చెయ్యాల్రా?' అని తటపటాయిస్తున్నాడు. అంతలో వాళ్ల వొక్క లగువులో వచ్చి అదుముకున్నారు. 'నడు స్టేషన్‌కన్నారు. కాళ్లావేళ్లాపడి కన్నీళ్ళతో వాళ్ళ పాదాలను కడిగితే 'ఈ వెధవనంత దూరం తీసకపోవడమెందుకు' అంటూ రెక్కలు విరిచి చెట్టుకు గట్టి గొడ్డును బాదినట్టు బాదారు. ఆ రంపుతో వరదుడు ఎగిరిపడి లేచాడు. వాడు అరున్నొక్క రాగాన్ని ఆలాపిస్తుంటే 'నీ చావు నువ్వు చావరా నా కొడకా!' అంటూ స్పెషల్ బీటోళ్లు వెళ్లిపోయారు.

ఏడుస్తున్న బిడ్డను ఓదార్చాలని తండ్రి. 'తండ్రి రాలేదే' అని బిడ్డ. నడిమిట్టన మండుతున్న సూర్యుడిలా వాళ్ల గుండెలు మండుతున్నాయి. కుంటేలుగాడు చేతులకు కట్టిన కట్లు తెంపుకోవాలని పెనుగులాడుతున్నాడు. ఇది చట్టంవేసిన బంధం. అది తండ్రీ బిడ్డల మధ్య అనుబంధం. ఒకదానితో వొకటి పోటీపడుతున్నాయి. ఎండ సూదులతో పొడిచినట్లు పొడుస్తూ ఉంది. చేతులకు కట్టిన కట్లు పెనుగులాడుతుంటే కత్తితో కోసినట్లు కోతలు పెడుతున్నాయి. అయినా కుంటేలుగాడు పట్టు వదలలేదు. పెనుగులాడి పెనుగులాడి కడకెట్లో కట్లు తెంపుకున్నాడు.

వొళ్లంతా వాతలు. ముంజేతులంతా రక్తమయం. ఆ ఎండ పొద్దులో ఏడ్చి ఏడ్చి వరదుడు గుక్క తిప్పుకోలేకుండా సొమ్మసిల్లి పడిపోయాడు. ఇంత కాలం కడుపుకు కూడు పెట్టిన కత్తి చేజారి పోయింది!

అప్పుడు కూడా కుంటేలుగాడు ఇలా కుమిలి కుమిలి ఏడవలేదు!

"మా అయ్య కట్టెలు గొట్టే బతికినాడు. పాముపాత పణ్ణాడు. మా అమ్మ కూడా పొయ్యింది. నేనూ కట్టెలే కొడతా వుండా! నట్టింటికి నడిసొచ్చిన లచ్చిమి నాకు దక్కకుండా పొయ్యింది. పచ్చని చెట్టునుకొట్టే బతుకులు పైకెక్కి రావంటారు. నిజమేనేమొ?"

కుంటేలుగాడి మనస్సులో చిత్రంగా మెదిలిందీ ఆలోచన.

ఆ రోజు నుండి వాడు కత్తి పట్టలేదు!

అప్పుడు వాడి దృష్టి గవర్నమెంటోళ్లు తన తండ్రికిచ్చిన అయిదెకరాల పోరంబోకు నేలమీదపడింది. ఏది ఏమైనా తనమాదిర తనకొడుకు కట్టెలు కొట్టి బతకకూడ దనుకొన్నాడు. వారంలో నాలుగు రోజులు కూలికి పోతున్నాడు. ఆ కూలి డబ్బుల్లో అంతో ఇంతో మిగల

పెట్టుకొంటున్నాడు. మిగతా మూడు రోజులు తన పొలంలో చెట్టూ చేమా కొట్టి మిట్టా గట్టుతో పోరాడుతున్నాడు, కొడుకు భవిష్యత్తు తొలిపొద్దు రేకులా మురిపిస్తుంటే!

నెలలు తిరగక ముందే నేల దివ్యంగా తయారైంది!

"ఇందులో పంట పెట్టాల. పంట పెట్టాలంటే నీళ్లు కావాల. నీళ్లు కావాలంటే బాయి కావాల. బాయి కావాలంటే దుడ్లు కావాల. అవ్వే లేవే? పోనీ ఏందైనా మెట్ట పైరు పెట్టుకుందామంటే వానలు కురవాల. ఈసీమలో చినుకు రాలేదెప్పుడో?" కుంటేలుగాడు నెలలు తరబడి చెమటోడ్చి చదునుచేసిన భూమివైపు చూస్తాడు. అటుపైన ఆకాశం వైపు ఆశగా చూస్తాడు. ఎక్కడా మబ్బు తునక కనిపించదు. అలా చూసి చూసి వాడి గుండె కరిగి నాలుగు కన్నీటి బొట్లు రాలాయి. కానీ మేఘం మాత్రం కరగలేదు.

కట్టెలమ్మి బతుకుతున్నప్పుడు వాడికి చీకు చింతా లేదు. కట్టెలు తేవడం. అమ్మడం. తినడం. ఇప్పుడు తనకంటూ కాసంత ఆస్తి ఏర్పడేసరికి అన్నీ ఆలోచనలే!

"ఎట్లయినాసరే! ఈ బూమిలో ఒక బాయి తవ్వుకోవాల. ఆ బాయికి ఒక కరెంటు మిసిను పెట్టుకోవాల. రేత్రింబొగుళ్లు దాంట్లోనే పడి పొల్లాడాల. ఏడాదికి ఇరుగార్లు పంట పెట్టాల. మూడంకణాల పూరిల్లయినా ఏసుకోవాల. వరదుడు దొరమాదిర కూసోని తినాల!" వాడి ఊహలకు రెక్కలొస్తే అప్పుడు జరిగిన ఒక సంఘటన వాడి ఆశలకు ఊపిరిపోసింది.

వాడకు పరుగు దూరంలో ఉన్న ఆ ఊరు ఆపాయకట్టుకే తలకట్టు గ్రామం. ఆ పాయకట్టులో దాదాపు ఇరవై పల్లెలున్నాయి. అన్నింటికీ కలిపి తలకట్టు గ్రామంలో ఒక హైస్కూలు నెలకొల్పారు.

బడుల్లో ఏమి నేర్చుకొన్నా నేర్చుకొనక పోయినా రాజకీయం నేర్పడం నేర్చుకోవడం తప్పని సరి అయింది. అందుకే ఆ మారు మూల గ్రామంలోని హైస్కూల్లో కూడా ఎన్నికల తేదీని ప్రకటించారు హెడ్‌మాస్టర్. ఆమాట చెవిని పడడంతో విద్యార్థుల హడావిడి అంతా ఇంతా కాదు. ప్రచారం ఒక ఉద్యమంగా ప్రారంభించారు.

ఆపల్లెల్లో ప్రచార సాధనాలు ముఖ్యంగా గోడలే!

ఏ ఇంటి గోడమీద పడితే ఆ ఇంటి గోడమీద ఎన్నికల్లో నిలబడబోతున్న విద్యార్థులు తమ తమ స్థలాన్ని 'రిజర్వ్' చేసుకొంటున్నారు. ఆ రిజర్వ్డ్ స్థానం తనకే చెందినదని తెలియజేయడానికి ఆస్థలంలో ఒక మూల తన పేరు పొడి అక్షరాలతో రాసుకొంటున్నారు.

ఆ ఎన్నికల్లో ఒక హరిజన విద్యార్థి కూడా పోటీ చేస్తున్నాడు. అందరి లాగే ఆ విద్యార్థి కూడా ఊళ్లో గోడలమీద తన స్థానాన్ని రిజర్వ్ చేసుకొన్నాడు.

అప్పటికే నాలుగు కాకుల్ని చేరదీసుకొని, అవి అరిచినపుడంతా బొరుగుల్లా జేబులోని చిల్లర డబ్బులు చల్లుతూ ప్రాసలు మీసాలు తిప్పే నినాదాల్ని గోడలమీద కెక్కించాలని బయలుదేరిన రెడ్డి కొడుకు ఊళ్లో గోడలమీద హరిజనుడి రిజర్వేషన్లు చూసి మండిపడ్డాడు.

"ఈ మాల నా కొడకలకు యాడ చూసినా రిజర్వేజన్లు కావాల్నా? చదువుకోవాలంటే రిజర్వేషన్. మళ్ళీ చదువుకుంటే ఉద్యాగాల్లో రిజర్వేషన్. ప్రమోషన్లలో రిజర్వేషన్. వయసుల్లో రిజర్వేషన్. కడకు మా గోడలమింద కూడా రిజర్వేషన్. ఉండే రిజర్వేషన్లు చాలుగానీ కొడకలకు మన స్లోగన్సు రాయండ్రా రాయండి" రెడ్డి కొడుకు ఆజ్ఞ.

ఆ మాటకోసమే ఎదురుచూస్తూ ఉండిన కాకులు...గుంపుగా ఆ హరిజన విద్యార్థి మీదనే పడినంత తృప్తిగా గోడల మీద పడ్డాయి. కాళ్లతో గీరతా ముక్కుతో పొడస్తా హరిజనుడి పొడి అక్షరాల పేరును పొడిచి పొడిచి తుడిచాయి. అక్కడికి కాస్త శాంతించి, అప్పటికి ఆ చోటు తమకు సొంతమయినట్లు భావించి తమ నినాదాల్ని అందంగా రాసుకొన్నాయి.

"ఇది న్యాయమా?" అని సవినయంగా అడిగాడు హరిజనుడు.

"న్యాయమో అన్యాయమో? ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకోపో! నీ యబ్బతో కాకుంటే వాడబ్బతో!" అని తిరగబడ్డారు. తిరగబడడమే కాదు నాలుగంటించారు అడగడమే తప్పన్నట్లు. హరిజన విద్యార్థి కిమ్మనకుండా తలవంచి తన్నులు తిన్నాడు. వంచిన తలెత్తకుండా ముందుకు నడిచాడు. వికృతమైన నవ్వులు వీపును పొడిచాయి!

వాడలో అడుగుపెట్టి వంచిన తలను పైకెత్తాడా విద్యార్థి.

కుములుతున్న గుండెల్ని కుడిచేత్తో అదిమి పట్టుకొని తనకు జరిగిన అన్యాయాన్ని కన్నీళ్ళతో కలిపి వాళ్ళ గుండెలపై కుమ్మరించాడు. ఇది తనకు కాదు తన కులానికే తీరని అవమానమన్నాడు. ఈ అన్యాయాన్ని అందరూ కలిసి కట్టుగా ఎదుర్కొనకపోతే బతుకులే అన్యాయమైపోతాయని ఉసికొల్పాడు.

ఎన్నికల గొడవ దేవుడెరుగును కానీ, రెడ్డి కొడుక్కు అతని అనుచరులకు హాస్పిటల్లో స్పెషల్ వార్డుల్లో మంచాలు మాత్రం దక్కాయి. 'కుయ్యో మొర్రో' అంటూ మొనగాళ్లా మంచాలెక్కారు. ఎక్కిన మంచాల్ని కనీసం నెలదాకా దిగకూడదని శల్య పరీక్ష జరిపిన డాక్టరు హెచ్చరించాడు.

రెడ్డి కొడుకు పడకమీద పడితే రెడ్డిగారు ఈడెగిరి ఆడపడ్డాడు. అక్కడ నుండి ఎగిరి వాడమీద పడబోయాడు. అయితే అతని శ్రేయోభిలాషులు శ్రమపడి తలా ఒక్క చెయ్యేసి ఎగరనీకుండా పట్టుకొన్నారు. ఆ ఎగురుడు గసతో రెడ్డి వెనక్కూ ముందుకు ఊగుతుంటే -

"అయ్యా రెడ్డిగారూ! మా మాట కొంచిం శ్రెద్దగా వినండి. ప్రస్తుతపరిస్తితుల్లో వాళ్లు ముండ్లు. మనం అరిటాకులం. ఏదొచ్చి దేనిమింద పడినా చినిగేది మాత్రం అరిటాకే. అందుకని చేతులు కట్టుకోని సహించమని చెప్పడం లేదు. ప్రతీకారం జరగాల్సిందే. అయితే ప్రత్యక్షంగా మాత్రం కాదు." అని సలహా కూడా ఇచ్చారు.

ఫలితంగా ఒకనాడు సందకాడ వాడలో గుడిసెలంటుకొన్నాయి.

ఆరోజు తూర్పు గాలి తోలింది. అందువల్ల వాడలో తూర్పు వైపున ఇండ్లన్నీ కాలిపోయాయి. అదృష్టవశాత్తు పడమటి వైపు ఇండ్లన్నీ కాలిపోకుండా మిగిలాయి.

ఈ పుణ్యకార్యం కాస్త గ్రామపెద్దల చేతుల మీదుగా జరిగిందేనని, తమకు జరిగిన ఈ దారుణమైన అన్యాయాన్ని విచారించి తగు న్యాయం చేకూర్చమని హరిజనులు ప్రభుత్వానికి నివేదించుకొన్నారు.

హుటాహుటిగా జీపులు వచ్చాయి. కార్లు వచ్చాయి. జీపుల్లో కార్లల్లో అఫీసర్లు వాళ్ల పుందీ మార్బలం వచ్చారు. హడావుడిగా అటూ ఇటూ తిరిగారు. కాలిపోయిన ఇండ్లను చూసి కంట తడి పెట్టినంత పని చేశారు. 'అయ్యో!పాపం!!' అని సానుభూతి ప్రకటించారు. ఆ తర్వాత విచారణ ప్రారంభించారు.

తీగ కదిలిస్తే డొంకంతా కదిలినట్టు పిల్లవాళ్ల జగడం పెద్దవాళ్ల వరకు వెళ్లిందని తేలింది. హరిజనులకు జరిగింది అన్యాయమేనని రుజువయింది. అందుకే కలెక్టరు గారు తక్షణకర్తవ్యంగా అగ్నిబాధితులైన ప్రతికుటుంబానికి సహాయచర్యగా అయిదువేల రూపాయిలు స్వయంగా అందజేశారు.

కుంటేలుగాడి గుడిసె వాడకు చివరగా పడమటి దిశలో ఉంది. అది కాలిపోలేదు. వాడికి అయిదువేల రూపాయలు రాలేదు. అప్పుడు కూడా కుంటేలుగాడు ఏడవలేదు. కానీ కుల్లి కుల్లి చస్తున్నాడు.

"అయ్యో! నా గుడిసె కూడా కాలి పొయ్యుంటే...నాకూ అయిదువేలొచ్చుంటే...నా బూమిలో బాయి తొవ్వుకోనుందును. బాయికి మిసిను పెట్టుకోనుందును. ఆ మిసినునీళ్లను పైకెత్తి పోస్తా ఉంటే చూసినోళ్ల కండ్లు అత్నే పగిలి పోయేటట్టు పైరెక్కించి ఉందును. గుడిసె పెరికి పారేసి మూడంకణాల పూరిల్లేసికో నుందును. నా కర్మగాలి గుడిసె కూడా కాలిపోకుండా పాయనే!"

కుంటేలుగాడు కుళ్ళి కుల్లి చస్తున్నాడు!

పొలంలో నిలబడతాడు. పొలమంతా కలయచూస్తాడు. ఆ తరువాత దూరంగా కనబడే తన గుడిసెవైపు చూస్తాడు. 'అయ్యో!అదీ కాలిపోలేదే!' అని బాధ పడతాడు.

గుడిసెముందు నిలబడతాడు. పక్కన నిలబడి ఉండే కొడుకును చూస్తాడు. ఆ తరవాత కనుచూపు మేరలో ఉన్న పొలాన్ని చూస్తాడు. 'అయ్యో! ఇదీ కాలిపోలేదే!' అని అంగలారస్తాడు.

నిలిచినచోట నిలబడలేక కూర్చున్న చోట కూర్చోలేక కాలుగాలిన పిల్లిలా తిరగతా ఉంటే ఉన్నట్లుండి కుంటేలిగాడి కొక ఆలోచన తట్టింది. ఆ ఆలోచనతో వాడెగిరి గంతేశాడు.

ఆరోజు కుంటేలుగాడు కూలికి పోలేదు. పోనీ, తన పొలంలో పనికంటే దానికీ పోలేదు. గుడిసెలోనే కూర్చున్నాడు. వాడిలో వాడు తలుచుకొని తలచుకొని నవ్వుతున్నాడు. వాడి ఆనందానికి మేర లేదు. ఆ ఆనందంతో గుడిసింట్లో నుండి బయటికి, బయటి నుండి గుడిసింట్లోకి తిరుగుతూనే ఉన్నాడు. 'ఎందుకు నాయినా! ఈ పొద్దు పనికి పోలేదే?' అని అడిగిన కొడుకును అమాంతంగా జవురుకొన్నాడు. ముద్దులతో ముంచెత్తాడు. ఆ బుడతగాడికేమీ తోచకుండా మిడిగుడ్లు పెడితే, వాడి చేతిలో ఒక పది పైసల బిళ్ల పెట్టి

ఏమైనా కొనుక్కోని ఆడుకోబో నాయినా!' అని పంపించాడు.

మనిషిలో ఆతురత హెచ్చినపుడు కాలం నెమ్మదిగా నడుస్తున్నట్టు తోస్తుందేమో? వాడి పాలిటికి క్షణ క్షణ మొక యుగంగా గడుస్తూ ఉంది. ఓర్చుకోలేక పోతున్నాడు. మాటిమాటికీ గుడిసె బయటికి వచ్చి పొద్దు వంక అసహనంగా చూస్తున్నాడు.

వాడి పోరు పడలేక పొద్దు నడిమిట్టకొచ్చింది.

వాడలో అందరివీ కూలి బతుకులు. అందువల్ల ముసలీ ముతక, పిల్ల జెల్లా మినహాయిస్తే మనిషీ మట్రా మెదలడం లేదు. బిసురోమని వీధులు. ఆ ఎండపూట ముసలి ముతక ఏమూలల్లోనో ముడుక్కున్నారు. పిల్లలు వాళ్ల ఆటపాటల్లో వాళ్లున్నారు. కుంటేలుగాడు అదే సరైన అదను అనుకున్నాడు. గుడిసింట్లో దొంతికుండలు ఆదరా బాదరాదించాడు. అడుగు కడవలో దాచిపెట్టిన రూపాయి బిళ్లల్ని మొలసంచిలో పోసుకొని మొలకు చుట్టుకొన్నాడు. ఒక్క క్షణం చిలుక్కు తగిలించిన చిక్కాన్ని చూశాడు. దారాలు సళ్ళొదిలిన మంచాన్ని చూశాడు. భారంగా నిట్టూర్చాడు. చరచరా బయటికి నడిచాడు. చుట్టూ కలయజూశాడు. ఎక్కడా పురుగు మెదలడంలేదు.

చేతిలో అగ్గి పెట్టెను చూశాడు. సన్నగా నవ్వుకొన్నాడు. అగ్గి పెట్టెతీసి ఒక్క పుల్లచేతి[illegible]కొన్నాడు. ఆ పుల్లను గీశాడు. మండుతున్న ఆ పుల్లవైపు క్షణం మనసుపెట్టి చూశాడు. అలానే గుడిసెకంటించాడు. ఎండు బోద. అంటించడమే ఆలస్యంగా అంటుకొనింది. కుంటేలుగాడు ఒక్క లగువులో పరుగెత్తాడు.

ఊరి ముందర చింతతోపులో ఒక చెట్టుమాటున నిలబడ్డాడు. కాలుతున్న గుడిసె వైపు ఆశగా చూస్తున్నాడు.

గుడిసె బాగా అంటుకొనింది. వాడి మొగం విప్పారింది.

మెల్లగా గాలి ఆరంభమైంది. చుట్టు పక్కల ఇండ్లు అంటుకొన్నాయి. వాడు ఆనందంగా నవ్వుతున్నాడు.

ఉన్నట్లుండి గాలి తిప్పించి మళ్లించి కొట్టడానికి ఆరంభించింది. ఇంటి పైకప్పులు తెట్టెలు తెట్టెలుగా లేచి పడుతున్నాయి. వాడంతా అంటుకొనింది.

"అయ్యయ్యో! తూర్పోర ఇండ్లు కూడా అంటుకున్నాయే! ఎట్లబ్బా! మల్లా ఒకసారి వాళ్లకంతా అయిదువేలొచ్చేస్తాయే? పోనీలే. నాపేర్జెప్పుకోని తింటార్లే నాయాండ్లు!"

ఒక్క క్షణం అసూయపడినా కుంటేలుగాడి ఆనందానికి అవధుల్లేవు. మంచి ఎండ, తిప్పించి మళ్లించి కొడుతున్న గాలి. భగభగ మంటలు లేస్తున్నాయి. ఆ మంటల్లో నుండి కారు మేఘాల్లా పొగ. మేఘాల్లో మెరుపుల్లాగా భగభగ మంటలు. వాడలోని ముసలీ ముతకా, పిల్లాజెల్లా హాహాకారాలు చేస్తూ దిక్కుకొకరుగా పరుగెడుతున్నారు. గంపలకింద మూసిపెట్టినకోళ్లు ఆ సెగకే మాడిమసి అవుతున్నాయి. ఫెళఫెళా వెదురువాసాలు పగులుతున్నాయి. మంటలు నాల్కలు చాస్తూ పైకెగురుతూ ఉన్నాయి.

కుంటేలుగాడికివన్నీ కనిపంచడమే లేదు. వాడి ఆనందం వాడిది. వాడిప్పుడు పుత్ర

కామేష్టి యాగాన్ని నిర్వహించిన దశరథుడు. దశరథుడికి యజ్ఞపురుషుడు అమృత భాండాన్ని అందించాడు. ఆ మంటల్లో నుండి చిరునవ్వుల్తో నడిచి వస్తున్న కలెక్టర్ కుంటేలుగాడికి అయిదువేలు అందిస్తున్నాడు.

ఆ అయిదువేలతో పొలంలో బావి. బావిలో జల. ఆ జలను పైకెత్తి పోస్తూ కరెంట్ మిషన్. కన్నుల పండువగా పంట. కాలుమింద కాలేసుగొని కూర్చున్న కొడుకు.

తృప్తిగా నవ్వుకొన్నాడు కుంటేలుగాడు!

గాలి ఉధృతమయింది. ఇండ్లకప్పులు తెట్టెలుతెట్టెలుగా లేచి వెళ్లగలిగినంత దూరం వెళ్లి పడుతున్నాయి. కుంటేలుగాడి ఆశలు వాటితో పోటీ పడుతున్నాయి.

తండ్రి కోసం ఎక్కడెక్కడ వెదికాడో ఏమో పాపం? వరదుడికి తండ్రి చింతతోపులో కనిపించే సరికి 'నాయినా!' అని అరుస్తూ పరుగెత్తుకొని వస్తున్నాడు.

కొడుకు కంటపడేసరికి వాడి వొళ్లు పరవశించింది. 'రా! నాయినా! రా!!' అంటూ రెండు చేతులూ చాపుతున్నాడు. వాడి భవిష్యత్తు మీద కమ్మని కలలతో కాలు కదపలేక పోతున్నాడు. వరదుడు మాత్రం 'నాయినా!నాయినా!' అంటూ పరుగుల మీద వస్తూనే ఉన్నాడు.

ఇద్దరి మధ్య పది బారల దూరం. ఆ పదిబారల దూరం పరుగెత్తితే బిడ్డ తండ్రి చేతుల్లో. బిడ్డ భవిష్యత్తు తండ్రి ఊహల్లో. అంతలోనే వచ్చిపడింది. ఎలా వచ్చిందో? ఇటు బారెడు అటు బారెడు తెట్టె. నిగనిగ లాడుతున్న తెట్టె. సరిగ్గా వచ్చి వరదుడి నెత్తిమీదనే పడింది.

"నాయినా!" అని ఒక గావుకేక పెట్టాడు వరదుడు.

"వరదా!" అని ఒక్క అరుపు అరిచాడు కుంటేలుగాడు.

ఇంకెక్కడి వరదుడు? బండకింద పడిన ఎలుక పిల్లలా కణకణలాడుతున్న అగ్ని కణాలతో కలిసిపోతున్నాడు.

"ఒక్క వేలు కుంటిదయితే అయింది మణుసు కుంటిది గాదులే" అని తృప్తి పడింది చెంగి. అయితే ఆ తృప్తిని అసంతృప్తిగా మిగిల్చి ఆ మనసే కుంటిదయింది స్వార్థంతో. ఊహలు భవిష్యత్తుకు తూగుటుయ్యాల కడితే అజ్ఞానం నిలువునా తెంపేసింది.

కుమిలి కుమిలి ఏడుస్తున్న కుంటేలుగాణ్ణి చూసి మిడిసి పడుతున్న మంటలు వొళ్ళు విరుచుకొంటూ పగలబడి నవ్వుతున్నాయి!

*-ఆంధ్రభూమి (4-8-1983)*

*(దీపావళి కథల పోటీలలో ప్రథమ బహుమతి)*